

ఒకే ఒక్కడు..
కడెం ప్రాజెక్ట్ నిర్వహణకు కొన్నేళ్లుగా సిబ్బంది కొరత ఉంది. కడెం మండల కేంద్రానికి చెందిన ప్రైవేట్ ఉద్యోగి గజ్జెల సునీల్ 13ఏళ్లుగా అన్నీ తానై ప్రాజెక్ట్‌ను నడిపిస్తున్నాడు. 8లో▸



కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరాలి
విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థితికి చేరాలని బాసర ఆర్జీయూకేటీ వీసీ వెంకటరమణ సూచించారు. బాసర ట్రిపుల్‌ఐటీలో ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. 10లో▸

గరిష్ఠం/కనిష్ఠం
28.0 /24.0

వాతావరణం
ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న మంత్రి, ఉద్యోగులు

నిర్మల్‌చైన్‌గేట్: ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసేందుకు తీసుకున్న నిర్ణయంతో జిల్లా కేంద్రంలోని డిపో ఎదుట సీఎం కేసీఆర్ చిత్రపటానికి రాష్ట్ర మంత్రి ఐకేరెడ్డి, ఉద్యోగులు, బీఆర్ఎస్ శ్రేణులు బుధవారం క్షీరాభిషేకం చేశారు. అనంతరం పటాకులు కాల్చి సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమానికి కేసీఆర్ ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. అనంతరం ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులకు మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి శుభాకాంక్షలు, అభినందనలు తెలిపారు.

అభ్యసన సామర్థ్యాలు పెంచాలి



మాట్లాడుతున్న సుభాష్ మోస్లే

తానూరు: అభ్యసన సామర్థ్యాలు పెరిగేలా చూడాలని కోర్సు జిల్లా డైరెక్టర్ సుభాష్ మోస్లే సూచించారు. బుధవారం తానూరు జిల్లా పరిషత్ పాఠశాలలో 'తొలిమెట్టు'లో భాగంగా ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు రెండో రోజు శిక్షణ తరగతులు కొనసాగించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా చూడాలని సూచించారు. భోసి జెడ్పీ స్కూల్ హెచ్‌ఎం గంగాధర్ తదితరులున్నారు.

సదర్మాట్‌కు వరద

ఖానాపూర్: మేడంపల్లి గ్రామంలోని సదర్మాట్‌కు ఎగువన కురుస్తున్న వర్షాలతో వరద ఉధృతి కొద్దిరోజులుగా కొనసాగుతోంది. బుధవారం సదర్మాట్ వద్ద 8.5 ఫీట్లలో వరద కొనసాగింది. సదర్మాట్ నుంచి 8,270 క్యూసెక్కుల నీరు గోదావరిలోకి వెళ్తుందని ఏఈఈ ఉదయ్ తెలిపారు. జలకళ సంతరించుకున్న సదర్మాట్‌ను చూసేందుకు సందర్శకులు వస్తున్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో పీడీ దేవేందర్

నర్సాపూర్(జి): మండలకేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులు బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజ్‌గ్రౌండ్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ 400 మీటర్ల పరుగుపందెంలో పాల్గొన్నారు. పరుగులో ఆర్.తులసీరాం, అండర్–16 జావెలిన్‌త్రో విభాగంలో జాదవ్ శివానంద్ మొదటి స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీడీ దేవేందర్ తెలిపారు. ఈ నెల 7న హనుమకొండలో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ మీట్‌లో వీరు పాల్గొంటారని పేర్కొన్నారు. వీరిని హెచ్‌ఎం కిషన్‌రావు అభినందించారు.

'ప్రసూతి ఆస్పత్రిలో విధులొద్దు'



నిరసన తెలుపుతున్న ఆశ కార్యకర్తలు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా ప్రసూతి ఆస్పత్రిలో తమ డ్యూటీలను వెంటనే రద్దు చేయాలని ఆశ కార్యకర్తల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు చంద్రకళ కోరారు. పారితోషకం లేని పనులు చేయించొద్దని బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రసూతి ఆస్పత్రి ఎదుట ఆశ కార్యకర్తలతో నిరసన తెలిపారు. ఆమె మాట్లాడుతూ.. జిల్లా ప్రసూతి ఆస్పత్రిలో డ్యూటీలు వేయడంతో రవాణాచార్జీలు భరించడం ఇబ్బందిగా మారిందని చెప్పారు. ప్రసూతి ఆస్పత్రిలో ఆశ కార్యకర్తలకు ప్రత్యేక గది కేటాయించి టీఏ, డీఏ అందించాలని కోరారు. పారితోషకం లేని పనులు చేయబోమని అధికారులకు చెబితే బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో లావణ్య, మంగ, లక్ష్మి, వాణి, కవిత, అనురాధ, పద్మ, గంగాజల, సుజాత, వరలక్ష్మి, జ్యోతి తదితరులున్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు పురస్కారాలు

భైంసాటౌన్: భైంసా ఆర్టీసీ డిపోకు చెందిన కండక్టర్లు భోజన్న, నర్సయ్య, ముత్యం, డ్రైవర్ సిద్దిఖ్ ఉత్తమ పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ మేరకు ఆదిలాబాద్‌లోని రీజియన్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆర్‌ఎం సొలొమాన్ చేతుల మీదుగా నగదు పురస్కారం, అవార్డు అందుకున్నారు. డీఎం అమృత, ఉద్యోగులు వీరిని అభినందించారు.

కడెం నీటి విడుదలెప్పుడో!




కడెం ప్రాజెక్ట్

- జూలై 28న విడుదలకు నిర్ణయం
- వరదలకు దెబ్బతిన్న కాలువలు
- నిండా నీరున్నా నిరుపయోగమేనా?
- ఆందోళనలో ఆయకట్టు రైతాంగం

కడెం: అన్నీ ఉన్నా అల్లుని నోట్లో శని.. అన్న చందంలా మారింది కడెం ఆయకట్టు రైతాంగం పరిస్థితి. ప్రాజెక్ట్‌లో సమృద్ధిగా నీరున్నా దిగువకు వదలని దుస్థితి. ఇటీవల భారీ వరదలతో ఆయకట్టు కాలువలు దెబ్బతిన్నాయి. దీంతో సాగునీటి విడుదలకు బ్రేక్ పడింది. వానాకాలం పంటల సాగుకు సమాయత్తమైన రైతన్నల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది.

సాగుకు సిద్ధంగా ఉన్నా..
కడెం ప్రాజెక్ట్ నిర్మల్, మంచిర్యాల జిల్లాలకు సాగు నీటిని అందిస్తోంది. ఆయకట్టు కింద కడెం, దస్తురాబాద్, జన్నారం, దండేపల్లి, హాజీపూర్, లక్సెట్టిపేట మండలాల్లో కుడి, ఎడమ కాలువల ద్వారా సుమారు 70వేల ఎకరాలు (ఖరీఫ్‌లో) సాగవుతాయి. యాసంగిలో సుమారు 50వేల ఎకరాలు సాగు కానున్నాయి. వానాకాలం సీజన్ ప్రారంభమై సాగు పనులు పూర్తి చేసుకుని నాట్లు వేసేందుకు రైతులు సిద్ధంగా ఉన్నా.. కాలువనీళ్లు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి. అసలు వస్తాయా.. లేదా.. అనే అయోమయంలో రైతులున్నారు. గత నెల 28నుంచి ఆయకట్టు కుడి, ఎడమ కాలువలకు సాగు నీటిని విడుదల చేస్తామని జూలై 26న నీటిపారుదల శాఖ అధికారులు ప్రకటించినా కడెం ప్రాజెక్ట్‌కు వచ్చిన భారీ వరదలతో బ్రేక్ పడింది. ఎడమ కాలువకు సుమారు వెయ్యి క్యూసెక్కులకు పైగా నీటిని విడుదల చేయాలి.. కానీ.. కాలువ మరమ్మతు పనులు పూర్తికాక ఇటీవలే అధికారులు 100 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఆ నీరు దస్తురాబాద్ వరకు వెళ్లడం లేదని రైతులు వాపోతున్నారు.



ఎడమ కాలువ నుంచి వెళ్తున్న నీరు (ఫైల్)

పూర్తికాని మరమ్మతులు
ఇటీవల వచ్చిన భారీ వరదలతో కడెం ప్రధాన (ఎడమ) కాలువకు ప్రాజెక్ట్ వద్దే కోతకు గురైంది. కడెం మండలం అంబారిపేట్ సమీపంలో కాలువ దెబ్బతింది. అలాగే జన్నారం మండలం ఇంధన్‌పల్లి సమీపంలో కాలువ మరమ్మతు చేయాల్సి ఉంది. కన్నాపూర్, కొండుకూర్, బెల్లాల్ గ్రామాలకు సాగు నీరందించే కుడి కాలువ మరమ్మతులు పూర్తికాలేదు. దీంతో సాగునీరు విడుదల చేయలేకపోతున్నామని నీటిపారుదల శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

నీటిని విడుదల చేయాలి



కడెం ఆయకట్టు కింద వానాకాలం పంటల సాగు పనులు పూర్తయ్యాయి. నాట్లు వేసేందుకు ఎదురుచూస్తున్నాం. ఎడమ కాలువకు వెంటనే మరమ్మతులు పూర్తి చేయించాలి. కాలువకు పూర్తి స్థాయిలో నీటిని విడుదల చేయాలి.
– విష్ణువర్ధన్, రైతు, కలమడుగు, జన్నారం

త్వరలోనే విడుదల చేస్తాం



కడెం ప్రాజెక్ట్ కుడి, ఎడమ కాలువలకు మరమ్మతులు పూర్తి చేయాల్సి ఉంది. మరమ్మతులు పూర్తి కాగానే ఆయకట్టుకు కాలువలకు పూర్తి స్థాయిలో నీటిని విడుదల చేస్తాం. ఆయకట్టు రైతులు ఆందోళన చెందవద్దు. – భోజదాసు, డీఈ, కడెం ప్రాజెక్ట్

ఖజానాకు 'కిక్' రెడీ

- నూతన మద్యం పాలసీ మార్గదర్శకాలు
- గౌడ్స్, ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు ఖరారు
- నేడు ఆయా షాపుల గుర్తింపునకు కలెక్టర్ల సమక్షంలో లాటరీలు
- రేపు టెండర్ నోటిఫికేషన్
- ఎక్సైజ్ శాఖ కసరత్తు

సాక్షి,ఆదిలాబాద్: నూతన మద్యం పాలసీకి సంబంధించి ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. గౌడ్స్, ఎస్సీ, ఎస్టీలకు సంబంధించి జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ చేసిన షాపుల సంఖ్యను ప్రకటించింది. గౌడ్స్‌కు 15 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 5 శాతం కేటాయించింది. గురువారం ఆయా షాపుల గుర్తింపునకు సంబంధించి కలెక్టర్ల సమక్షంలో లాటరీ తీయనున్నారు. శుక్రవారం టెండర్ నోటిఫికేషన్ జారీ కానుంది. ఇందుకోసం ఎక్సైజ్ శాఖ కసరత్తు చేస్తోంది. కాగా, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మొత్తం 192 మద్యం దుకాణాలు ఉండగా, 135 జనరల్‌కు కేటాయించగా, 57 షాపులకు రిజర్వేషన్ కల్పించారు.

ముందస్తుగా టెండర్లు..
ప్రభుత్వం 2023–25 కోసం నూతన మద్యం పాలసీకి సంబంధించి టెండర్ నోటిఫికేషన్‌కు సిద్ధమైంది. గతంలో అంటే.. 2021–23కు సంబంధించి నవంబర్ 2021లో టెండర్లు నిర్వహించింది. నూతన పాలసీకి సంబంధించి కూడా వచ్చే నవంబర్‌లో టెండర్లు నిర్వహించవచ్చని లిక్కర్ వ్యాపారులు భావించారు. అయితే ఆ సమయంలో ఎన్నికల కోడ్ అమలైతే ఈ టెండర్లు నిర్వహించేందుకు అవకాశం ఉండదని భావించిన ప్రభుత్వం ముందస్తుకు సిద్ధమైంది. ప్రస్తుతం కొనసాగుతున్న మద్యం దుకాణాల గడువు నవంబర్ 30తో పూర్తవుతుంది. కొత్త పాలసీలో దుకాణాలు దక్కించుకునేవారు వచ్చే డిసెంబర్ 1 నుంచి వాటిని తెరవాల్సి ఉంటుంది.



ఉమ్మడి జిల్లాలో వైన్స్ షాపుల వివరాలు (రిజర్వేషన్, జనరల్ వారీగా)

జిల్లా	వైన్స్‌ల సంఖ్య	రిజర్వేషన్			జనరల్
		గౌడ్స్	ఎస్సీ	ఎస్టీ	ఇలా..
ఆదిలాబాద్	40	01	05	09	25
కుమురంభీం	32	02	04	05	21
మంచిర్యాల	73	06	10	06	51
నిర్మల్	47	03	05	01	38
మొత్తం	192	12	24	21	135



అప్పట్లో ఆదాయం ఇలా..
రెండేళ్ల క్రితం టెండర్ల ద్వారా ప్రభుత్వానికి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రూ.58.8 కోట్ల ఆదాయం లభించింది. ఆ పాలసీలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2,940 దరఖాస్తులు రాగా, పైన పేర్కొన్న ఆదాయం వచ్చింది.
- ఆదిలాబాద్ జిల్లాలో 40 షాపులకు గాను 591 దరఖాస్తులు రాగా, రూ.11.82 కోట్ల ఆదాయం లభించింది.
- మంచిర్యాలలో 73 షాపులకు 1,170 దరఖాస్తులు రాగా, రూ.23.40 కోట్ల ఆదాయం సమకూరింది.
- నిర్మల్‌లో 47 షాపులకు గాను 556 దరఖాస్తులు రాగా రూ.11.12 కోట్ల ఆదాయం వచ్చింది.
- కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 32 షాపులకు గాను 623 దరఖాస్తులు రాగా, రూ.12.46 కోట్ల ఆదాయం లభించింది.

నూతన తహసీల్దార్లకు బాధ్యతలు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాకు వచ్చిన నూతన తహసీల్దార్లకు బుధవారం కలెక్టర్ వరుణ్‌రెడ్డి బాధ్యతలు కేటాయించారు. దుర్వా లక్ష్మణ్ (పెంబి), మహ్మద్ అతికొద్దీన్ (ముధోల్), పవన్‌చంద్ర జాకటే (బాసర), ఎస్.శ్రీదేవి (సారంగపూర్), శివ్‌రాజ్ (సోన్), ఎంఏ సర్వరాజ్ నవాజ్ (మామడ), ఏ మోతీరాం (లోకేశ్వరం), ఎం.సోము (డీఏవో, నిర్మల్), ఎం రాజేశ్వరి (కడెం), ఇజాజ్ అహ్మద్‌ఖాన్ (సూపరింటెండెంట్, కలెక్టరేట్), ఎల్.ప్రవీణ్‌కుమార్ (సూపరింటెండెంట్, కలెక్టరేట్), ఎస్.శ్రీనివాస్ (నిర్మల్‌రూరల్), పీ విజయ్‌కుమార్ (కుభీర్), బీ రవి (తానూర్), కే మల్లేశ్ (నిర్మల్‌అర్బన్), పరిమల్ భోమ్నిక్ (ఖానాపూర్), ఎం.లింగమూర్తి (డీఏవో ఆర్డీవో నిర్మల్), బీ లక్ష్మణ్ (కుంటాల), కే సురేశ్ (ఏవో, కలెక్టరేట్), ఎండీ జాకీర్ (దస్తురాబాద్), కే గజానన్ (నర్సాపూర్ జీ), సంతోష్ (సూపరింటెండెంట్, కలెక్టరేట్), శ్రీలత (లక్ష్మణచాంద), సరిత (దిలావర్‌పూర్)కు బాధ్యతలు అప్పగించారు.

108, 102 వాహనాలు ప్రారంభం



నిర్మల్‌చైన్‌గేట్: ఇటీవల జిల్లాకు కేటాయించిన 108, 102 వాహనాలను మంత్రి ఐకేరెడ్డి, కలెక్టర్ వరుణ్‌రెడ్డి జిల్లా కేంద్రంలోని అగ్నిమాపకశాఖ కార్యాలయంలోగల 108 కార్యాలయంలో బుధవారం ప్రారంభించారు. ఎమర్జెన్సీ సేవలను ప్రభుత్వం మరింత పటిష్టం చేయనుందని వారు తెలిపారు.

పోలింగ్‌స్టేషన్ల రేషనలైజేషన్‌పై సమీక్ష

నిర్మల్‌చైన్‌గేట్: పోలింగ్‌స్టేషన్ల రేషనలైజేషన్‌పై బుధవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, ఆర్డీవో రత్నకల్యాణి, తహసీల్దార్లతో సమీక్ష నిర్వహించారు. ప్రజలకు అందుబాటులో ఉండేలా పోలింగ్‌స్టేషన్లు ఏర్పాటు చేయాలని సూచించారు.

నులిపురుగులను నిర్మూలించాలి

నిర్మల్‌చైన్‌గేట్: నులిపురుగులను నిర్మూలించాలని డీఎంహెచ్వో ధనరాజు బుధవారం ఓ ప్రకటనలో సూచించారు. జిల్లాలో గురువారం నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు.

రవీంద్రభారతిలో చిన్నారుల నృత్య ప్రదర్శన

నిర్మల్‌ఖిల్లా: హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో బుధవారం రాష్ట్ర సాంస్కృతికశాఖ సౌజన్యంతో, శ్రీశాంతికృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శనలో జిల్లా కేంద్రానికి చెందిన ఎనిమిది మంది చిన్నారులు ప్రతిభ చాటారు. భాగ్యనగర్‌కు చెందిన సంగినేని నవ్యవినయ్ శిక్షణలో జిల్లాకు చెందిన శన్విక, వంశిక, వర్షిణి, తన్వి, ఎం.నిత్య, నిధి, వి.నిత్య, శ్రద్ధ నృత్య ప్రదర్శనలో ఆకట్టుకోగా నిర్వాహకులు వీరిని స్వర్ణ నంది, ప్రశంసాపత్రాలతో సత్కరించారు.

రుక్మాబాయికి దాతల చేయూత

- సాక్షి కథనానికి స్పందించిన దాతలు

సాక్షి ఎఫెక్ట్..

భైంసారూరల్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరదలు ముంచెత్తగా పంట పొలాల్లో ఇసుక మేటలు, బండరాళ్లు కుప్పలుగా ఏర్పడ్డాయి. హద్దురాళ్లు చెరిగిపోయాయి. సాగుకు పనికి రాకుండా మారిన భూములను చూసి రైతులు పడుతున్న ఆవేదనపై 'సాక్షి' 'కదిలిస్తే కన్నీళ్లే'.. 'సాయమందేనా..?' శీర్షికలతో కథనాలు ప్రచురించింది. ఇలేగాం గ్రామానికి చెందిన బట్టు రుక్మాబాయికి చెందిన మూడెకరాల సాగుభూమిలో రాళ్లకుప్పలు గుట్టలుగా పడి ఉండగా ప్రభుత్వం భూమి సర్వేచేసినా ఇప్పటివరకు పరిహారంపై ఎలాంటి ప్రకటన చేయలేదు. దీంతో రుక్మాబాయి దీనస్థితిపై బుధవారం 'సాయమందేనా?' శీర్షికన ప్రచురించిన కథనానికి దాతలు స్పందిస్తున్నారు. గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఉప్పు జ్యోతిదత్తు తనవంతుగా రూ.10వేలు ఆర్థిక సాయం ప్రకటించారు. అక్కడి ధర్మజాగరణ సమితి, గ్రామ యువకులు ఫోన్‌పేతో తోచిన సాయం అందిస్తున్నారు.

హైదరాబాద్ యోగా కేంద్రం నుంచి...
ఇలేగాం గ్రామానికి చెందిన సీహెచ్ వీరన్న హైదరాబాద్‌లో యోగా శిక్షణ ఇస్తున్నారు. అక్కడే ప్రణవ అథయోగ కేంద్రంలో ఈ పరిస్థితిని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా నలుమూలల నుంచి శిక్షణ పొందేవారు చలించి తమవంతుగా సాయం అందించారు. రూ.56,423 జమచేసి వీరన్నకు అందజేశారు. ఈ మొత్తాన్ని బుధవారం వీరన్న ఇలేగాం గ్రామానికి వచ్చి రుక్మాబాయికి అందించారు.



సాయం అందజేస్తున్న సమితి సభ్యులు

మావంతు సాయమందించాం



హైదరాబాద్‌లోని యోగా శిక్షణ కేంద్రంలో వరదల పరిస్థితి వివరించాను. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాంతాల నుంచి శిక్షణ పొందేవారు విషయం తెలుసుకుని విరాళాలుగా రూ.56,423 సేకరించారు. ఈ మొత్తాన్ని గ్రామస్తులతో రుక్మాబాయికి అందించాం. ఆమె మూడెకరాలు ఆనవాళ్లు లేకుండా పోయింది. అందుకే ఆమెకు మా వంతుగా సాయం చేసేందుకు ముందుకువచ్చాం.
– సీహెచ్ వీరన్న

సంక్షేమ పథకాల్లో తెలంగాణ టాప్

- రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి
- అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- కల్యాణలక్ష్మి చెక్కులు అందజేత

సారంగపూర్: ఏ రాష్ట్రంలో లేనన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం టాప్‌లో ఉందని రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం రూ.1.13కోట్లతో చేపట్టిన ప్రహరీ, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం మార్కెట్ ఆవరణలో రైతులకు జెర్సీ ఆవులు పంపిణీ చేశారు. ఎంపీడీవో కార్యాలయంలో కలెక్టర్ వరుణ్‌రెడ్డితో కలిసి హరితహారంలో భాగంగా మొక్కలు నాటారు. తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో నిర్మించిన ఇంకుడుగుంతలు పరిశీలించారు. రైతువేదికలో 36మందికి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ప్యారమూర్, ధని గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందజేశారు. మంత్రి తనయుడు అల్లోల గౌతంరెడ్డి సొంత ఖర్చులతో విద్యార్థులకు బస్సు పాసులు పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తూ అన్ని వర్గాల ప్రజలను ఆదుకుంటున్నది తెలంగాణ ప్రభుత్వమేనని చెప్పారు. మరోసారి బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తంజేశారు. కార్యక్రమాల్లో ఆర్డీవో రత్నకళ్యాణి, ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జి అల్లోల మురళీధర్‌రెడ్డి, ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ ధర్మాజీ రాజేందర్, ఆర్బీఎస్ జిల్లా అధ్యక్షుడు నల్ల వెంకట్రామిరెడ్డి, అడెల్లి ఆలయ రెనోవేషన్ కమిటీ అధ్యక్షుడు ఆయిటి చందు, నాయకులు మాణిక్‌రెడ్డి, అయిర నారాయణరెడ్డి తదితరులున్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి, కలెక్టర్

పారిశుధ్య పనుల పరిశీలన

ఖానాపూర్: సత్తనపల్లిలో స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్–2023 కార్యక్రమం అమలు తీరు తెలుసుకునేందుకు కేంద్ర కమిటీ సభ్యుడు రాకేశ్ బుధవారం గ్రామంలో పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. తడి, పొడి చెత్త, మురుగునీటి నిర్వహణ, బహిరంగ మల విసర్జన తదితర విషయాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాల, పల్లె దవాఖాన, అంగన్‌వాడీ కేంద్రం, గ్రామపంచాయతీ కార్యాలయం, రైతువేదికను పరిశీలించారు. కమిటీ సభ్యుడి పర్యటన వివరాలు తెలుసుకున్న అధికారులు మంగళవారం బుధవారం గ్రామానికి చేరుకుని హడావుడిగా పనులు చేపట్టడం గమనార్హం. ఆయన వెంట ఎంపీడీవో మల్లేశ్, ఎంపీవో చంద్రశేఖర్, నాయకులు సీర్ల విజయ్, గంగాధర్, అక్షిత తదితరులున్నారు.

గడ్‌చాంద గ్రామంలో..
లోకేశ్వరం: మండలంలోని గడ్‌చాంద గ్రామంలో స్వచ్ఛ సర్వేక్షణ్ పనులను పరిశీలకుడు సునీల్ పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సెగ్రిగేషన్, ఇంకుడు గుంతలు, పాఠశాల మరుగుదొడ్లు, గ్రామాల్లోని మరుగుదొడ్లు, పెరటి తోటలను పరిశీలించి వారి ఫోన్ యాప్‌లో అప్‌లోడ్ చేశారు. పూర్తి నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామని చెప్పారు. ఆయన వెంట డీఎల్పీవో శివకృష్ణ, ఎంపీడీవో సోలమాన్ రాజ్, గ్రామ సెక్రటరీ రాఘవేందర్, గ్రామ సర్పంచ్ వెంకట్‌రావు ఉన్నారు.



ఖానాపూర్‌లో వివరాలు తెలుసుకుంటున్న రాకేశ్

కుంటాల మండల కేంద్రంలో..
కుంటాల: మండల కేంద్రంలో చెత్త సేకరణ, మరుగుదొడ్ల వినియోగం, డంప్‌యార్డులు, కాలువలు, ఇంకుడుగుంతలు, పారిశుధ్య పనులను స్వచ్ఛ సర్వేక్షణ్ కేంద్ర బృందం సభ్యుడు ప్రశాంత్ బుధవారం పరిశీలించారు. చెత్తతో వర్మీ కంపోస్టు తయారు చేయాలని సూచించారు. డీఆర్డీవో విజయలక్ష్మి, సర్పంచ్ సమత వెంకటేశ్, ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, ఎంపీవో రహీం, ఏపీవో నవీన్, ఏపీఎం భోజన్న, పంచాయతీ కార్యదర్శి రాజబాపు తదితరులున్నారు.

ధర్మాజీపేట్, ఎలగడప గ్రామాల్లో..
కడెం: ధర్మాజీపేట్, ఎలగడప గ్రామాల్లో స్వచ్ఛసర్వేక్షణ్ టీం సభ్యులు పర్యటించారు. ఇంకుడుగుంతలు, వైకుంఠధామం, సెగ్రిగేషన్ షెడ్డు, పారిశుధ్య నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. జెడ్పీ సీఈవో సుధీర్‌బాబు, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎంపీవో ఉపేందర్, టీం సభ్యులు గణేశ్, వెంకటేశ్, సర్పంచులు వెంకటేశ్, సత్తెవ్వ తదితరులున్నారు.

'తొలిమెట్టు' శిక్షణ వినియోగించుకోవాలి

నిర్మల్ రూరల్: తొలిమెట్టు శిక్షణ సద్వినియోగం చేసుకొని నిష్ణాతులుగా తయారు కావాలని డీఈవో రవీందర్‌రెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. తొలిమెట్టు మండల స్థాయి శిక్షణ శిబిరం బుధవారం జిల్లా కేంద్రంలోని సోమవార్‌పేట్ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రారంభమైంది. నిర్మల్ రూరల్, అర్బన్, సోన్ మండలాల ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులలో దాగి ఉన్న అభ్యసన ప్రగతి, పఠనాసక్తి, అభ్యసన ఫలితాల సాధనకు శిక్షణ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఈవో శంకర్, హెచ్‌ఎంలు జాఫర్ మొహినొద్దీన్, నోడల్ అధికారి నీరజారాణి, ఆర్పీలు స్వామి, విలాస్, బాపయ్య తదితరులున్నారు.

శాలసిద్ధిపై శిక్షణ
జిల్లా కేంద్రంలోని వశిష్ఠ డిగ్రీ కళాశాలలో శాలసిద్ధిపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని డీఈవో రవీందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో పైలట్ ప్రాజెక్ట్ కింద 11 ఉన్నత పాఠశాలలు, ఐదు ప్రాథమికోన్నత పాఠశాలలు, 15 ప్రాథమిక పాఠశాలలను ఎంపిక చేశామన్నారు. ఎంపిక చేసిన ఉపాధ్యాయులకు రెండురోజుల శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. సెక్టోరల్ అధికారులు నర్సయ్య, రాజేశ్వర్, ప్రవీణ్‌కుమార్, శ్రీదేవి, లింబాద్రి, ఆర్పీలు పరమేశ్వర్, గంగన్న, సాజిద్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రవీందర్‌రెడ్డి

పీఈటీలతో సమావేశం
జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఎస్జీఎఫ్ క్రీడల నిర్వహణపై వ్యాయామ ఉపాధ్యాయులతో డీఈవో రవీందర్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. క్రీడా క్యాలెండర్ ప్రకారం ఆటల పోటీలు నిర్వహించాలని సూచించారు. ఎస్జీఎఫ్ జిల్లా సెక్రటరీ రమణారావు, పెటా అధ్యక్షుడు రమేశ్, కార్యదర్శి భోజన్న, ఎస్జీఎఫ్ మాజీ కార్యదర్శి శ్రీనివాస్, వ్యాయామ ఉపాధ్యాయులు భూమన్న, అంబాజీ, రమణ, అన్నపూర్ణ, వెన్నెల, జమున, సంగీత తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఒకరి అదృశ్యం


రామాగౌడ్

డొంకేశ్వర్(ఆర్మూర్): నిజామాబాద్ జిల్లా డొంకేశ్వర్ మండలం దత్తాపూర్ గ్రామానికి వచ్చిన అబ్బగోని రామాగౌడ్ అదృశ్యమైనట్లు ఎస్సై రాహుల్ ఒక ప్రకటనలో తెలిపారు. నిర్మల్ జిల్లా సోన్ మండలానికి చెందిన రామాగౌడ్(65) 15 రోజుల క్రితం తన కూతురిని చూసేందుకు డొంకేశ్వర్ మండలం దత్తాపూర్ వచ్చాడని పేర్కొన్నారు. మూడు రోజులపాటు అక్కడే ఉండి జూలై 19న సాయంత్రం బయటకు వెళ్లొస్తానని చెప్పి మోటార్‌సైకిల్‌పై వెళ్లి తిరిగి రాలేదని తెలిపారు. ఆచూకీ లభించకపోవడంతో కూతురు రవళి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య


రోహిత్(ఫైల్)

తాంసి: ప్రేమించిన యువతితో కుటుంబ సభ్యులు పెళ్లికి నిరాకరించడంతో మనస్తాపానికి గురై యువకుడు మృతి చెందిన సంఘటన భీంపూర్ మండలంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం భీంపూర్ మండలంలోని అర్లి(టి) గ్రామానికి చెందిన రోహిత్ (24) వ్యవసాయం చేస్తూ కుటుంబా నికి అండగా ఉంటున్నాడు. కొంతకాలంగా అదే గ్రామానికి చెందిన యువతిని ప్రేమిస్తున్నాడు. యువతి కుటుంబ సభ్యులు పెళ్లికి అంగీకరించకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. బుధవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మనస్తాపంతో ఒకరు..

తలమడుగు: పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తలమడుగు మండలంలోని పల్సి బి (తాండ) గ్రామానికి చెందిన జాదవ్ పకీర (65) కొంతకాలంగా క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా వ్యాధి నయం కాకపోవడంతో మనస్తాపం చెందాడు. బుధవారం పురుగుల మందు తాగి తనఇంటి సమీపంలో పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై ధనశ్రీ తెలిపారు.

ఇద్దరిపై అట్రాసిటీ కేసు

ఇచ్చోడ(బోథ్): మండలంలోని సిరిచెల్మలో అప్పు చెల్లించలేదని ఇంటికి తాళం వేసిన ఘటనలో తీర్పు చెప్పిన సర్పంచ్ భర్తతో పాటు ఆసామిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేష్ తెలిపారు. బుధవారం ఎస్సై నరేష్ పోలీస్‌స్టేషన్‌లో వివరాలను వెల్లడించారు. అప్పు చెల్లించలేదని ఇంటికి తాళం వేయాలని తీర్పు చెప్పిన సిరిచెల్మ సర్పంచ్ భర్త కన్నమయ్య, యజమాని రాజేందర్‌పై బాధితుడు శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఒకే ఒక్కడు..


జనరేటర్‌కు మరమ్మతులు చేస్తున్న సునీల్

- ఎలక్ట్రీషియన్, గేటు ఆపరేటర్, జనరేటర్ ఆపరేటర్
- అన్నీ తానై విధులు నిర్వహణ
- కడెం ప్రాజెక్ట్‌ను నడిపిస్తున్న చిట్టీ

కడెం(ఖానాపూర్): కడెం ప్రాజెక్ట్ ఉమ్మడి జిల్లాలో ప్రధాన సాగునీటి ప్రాజెక్ట్. ఆరు దశాబ్దాలుగా ఆయకట్టు రైతాంగానికి అండగా నిలిచిన ప్రాజెక్ట్ ఒకవైపు గేట్ల మొరాయింపు.. మరోవైపు సిబ్బంది కొరతతో నేడు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతుంది. ప్రాజెక్ట్‌కు గతంలో ఎంతో వైభవం ఉంది. నాడు వందల మంది సిబ్బందితో కళకళలాడింది. కానీ నేడు అరకొర సిబ్బందితో నెట్టుకొస్తున్నారు.

ఆల్‌రౌండర్

ప్రాజెక్ట్ నిర్వహణకు ఎస్ఈ, ఈఈ, డీఈ, ఏఈఈ తదితర పైస్థాయి అధికారులతో పాటు కింది స్థాయి సిబ్బంది ఎంతో కీలకం. కడెం ప్రాజెక్ట్‌పై గతంలో వర్క్‌ఇన్‌స్పెక్టర్లు, లస్కర్, గేటు ఆపరేటర్, జనరేటర్ ఆపరేటర్, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, తదితర విభాగాల్లో షిఫ్టుకు కొంతమంది చొప్పున ఉద్యోగులు ఉండేవారు. కానీ గతంలో నియామకమైన ఉద్యోగులే తప్ప మళ్లీ నూతన నియామకాలు చేపట్టకపోవడంతో కొన్నేళ్లుగా ప్రాజెక్టును సిబ్బంది కొరత వేధిస్తోంది. ప్రాజెక్ట్ గేట్లు ఎత్తేందుకు ప్రధానమైన ఎలక్ట్రీషియన్, గేటు ఆపరేటర్, జనరేటర్ ఆపరేటర్.. ఇలా ఆయా విభాగాల్లో సుమారు పది మంది ఉద్యోగులు పని చేయాలి. కానీ ఒక్కరంటే ఒక్క ఉద్యోగి లేకపోవడం గమనార్హం. మండల కేంద్రానికి చెందిన గజ్జెల సునీల్(చిట్టి) పదమూడేళ్లుగా కడెం ప్రాజెక్ట్‌పై ప్రైవేటు ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నాడు. ఇతనే గేటు ఆపరేటర్‌గా గేట్లు ఎత్తడం, జనరేటర్ ఆపరేటర్‌గా జనరేటర్ నిర్వహణ చూసుకోవడం, ప్రాజెక్ట్‌పై కీలకమైన ఎలక్ట్రీషియన్ విధులు నిర్వహిస్తూ అన్నీ తానై పదిమంది ఉద్యోగులు నిర్వహించే పనిని ఒక్కడే చేస్తూ ఆల్‌రౌండర్‌గా కడెం ప్రాజెక్టును నడిపిస్తున్నాడు.

స్క్రాప్ ఉపయోగంలోకి..

ప్రాజెక్ట్ నిర్వహణలో జనరేటర్ ముఖ్యమైనది. వరదలు వచ్చే సమయంలో విద్యుత్ లేకుంటే జనరేటరే ఆధారం. కడెం ప్రాజెక్ట్‌కు అత్యవసర సమయంలో విద్యుత్‌ను అందించేందుకు మైసమ్మ ఆలయం సమీపంలో పవర్‌హౌజ్‌లో 1977లో ఏర్పాటు చేసిన జనరేటర్ సుమారు 34 ఏళ్ల పాటు ప్రాజెక్ట్‌కు సేవలందించింది. వివిధ కారణాలతో మొరాయించడంతో మూలన పడేశారు. దీంతో దానిని స్క్రాప్‌కు తరలించాలని అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. దానిస్థానంలో గేజ్ రూం వద్ద నూతన జనరేటర్‌ను ఏర్పాటు చేశారు. అయితే ఈ నూతన జనరేటర్ ఇటీవలే మొరాయించడంతో అధికారులు మరమ్మతు నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. అయితే మూలన పడిన జనరేటర్‌ను చిట్టీ మరో మెకానిక్‌తో కలిసి మరమ్మతులు చేయడంతో అది ఇప్పుడు ఉపయోగంలోకి వచ్చింది. ప్రస్తుతం కడెం ప్రాజెక్ట్‌కు అదే దిక్కయ్యింది.

సేవలను గుర్తించాలి



పదమూడేళ్లుగా కడెం ప్రాజెక్ట్‌పై ప్రైవేటు ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నా. పురాతన ప్రాజెక్ట్ కావడంతో తరచూ వరద గేట్లు మొరాయిస్తున్నాయి. భారీ వరదల సమయాల్లో ప్రాజెక్ట్ అధికారుల ఆదేశాల మేరకు ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వహించా. ఇప్పటికైనా ప్రభుత్వం, నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులు నా సేవలను గుర్తించి రెగ్యులరైజ్ చేయాలి.

– గజ్జెల సునీల్ (చిట్టీ), జనరేటర్ ఆపరేటర్

ఆర్టీసీ సేవలను విస్తరించడమే లక్ష్యం

- ఆర్టీసీ ఆర్ఎం సోలమన్

ఆదిలాబాద్: గ్రామస్థాయిలో ఆర్టీసీ సేవలను విస్తరించడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని ఆదిలాబాద్ ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సోలమన్ అన్నారు. బుధవారం ఆదిలాబాద్ బస్టాండ్‌లోని ట్రైనింగ్ సెంటర్లో విలేజ్ బస్సు ఆఫీసర్లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ అందజేసే సేవలను క్షేత్రస్థాయిలో ప్రజలకు తెలియజేయడానికి విలేజ్ బస్ ఆఫీసర్లు ఎంతగానో తోడ్పడతారన్నారు. 72 మంది విలేజ్ బస్ ఆఫీసర్లు ఉండగా ముందుగా 36 మందికి శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఆర్టీసీలో విధులను నిర్వర్తిస్తున్న డ్రైవర్, కండక్టర్, మెకానిక్‌లు స్వచ్ఛందంగా ఖాళీగా ఉన్న సమయాల్లో గ్రామాల్లో సంస్థ ద్వారా అందజేస్తున్న పథకాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. సంస్థ ప్రతినిధులు ప్రతి గ్రామంలో ఉండేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రయాణికులు ఆర్టీసీ ని ఆదరించేలా ఆర్టీసీ ఉద్యోగులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎం సురేష్ చౌహాన్, డీఎం కల్పన, తదితరులు పాల్గొన్నారు.

సంస్థ అభివృద్ధికి ఉద్యోగులు కృషిచేయాలి


ఉత్తమ ఉద్యోగులతో ఆర్టీసీ అధికారులు

ఆదిలాబాద్: సంస్థ ప్రగతి పథంలో ముందుకు సాగేలా ఉద్యోగులు కృషి చేయాలని ఆదిలాబాద్ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సోలమన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో బుధవారం ఆదర్శ ఉద్యోగుల సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్ఎం రీజియన్ పరిధిలో ఏప్రిల్ నుంచి జూన్ వరకు ఉత్తమ ఉద్యోగులుగా నిలిచిన వారిని జ్ఞాపికాలు, సర్టిఫికెట్లతో సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ అభివృద్ధి సాధించే దిశగా ఉత్తమ ఉద్యోగులు అందజేస్తున్న సేవలు మరువలేనిమన్నారు. వీరిని ఆదర్శంగా తీసుకొని మిగిలిన ఉద్యోగులు సైతం విధి నిర్వహణలో నిబద్ధతతో వ్యవహరిస్తూ సంస్థ ప్రగతికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎం సురేష్ చౌహాన్, డిపో మేనేజర్లు కల్పన, సాయన్న, అమత, ఏవో పోలయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాల పేరిట టోకరా వేసిన వ్యక్తి అరెస్టు

- ఒక్కొక్కరి నుంచి రూ.4 లక్షల వరకు వసూలు
- 400 మంది బాధితులు


నిందితుడు కడియాల రామకృష్ణ

ఖలీల్‌వాడి/మాక్లూర్: ఉద్యోగాలు ఇప్పిస్తానని నిరుద్యోగుల నుంచి ఒక్కొక్కరి వద్ద సుమారు రూ.4 లక్షల వరకు వసూలు చేసిన నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన కడియాల రామకృష్ణను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిజామాబాద్ ఒకటవ, మూడవ, ఐదోవ టౌన్ పరిధిలో కేసులు ఉన్నాయి. నిజామాబాద్ జిల్లాతోపాటు ఆదిలాబాద్, నిర్మల్, కరీంనగర్, కామారెడ్డి, హైదరాబాద్, జగిత్యాల, సిరిసిల్ల జిల్లాల్లోని 400 మంది నుంచి సుమారు రూ.6 కోట్లు వసూలు చేసినట్లు సమాచారం. 2017లో నిజామాబాద్‌లోని మాధవనగర్ వద్ద రామకృష్ణ విజేత డిఫెన్స్ అకాడమీ నిర్వహించేవాడు. శిక్షణ పొంది ఉద్యోగాలు సాధించిన వారి ఫొటోలు చూపించి తానే ఉద్యోగాలు ఇప్పించానని ప్రచారం చేసుకుంటూ డబ్బులు వసూలు చేశాడు. నిరుద్యోగులు నిలదీస్తే నకిలీ అపాయింట్‌మెంట్ పత్రాలు చూపించి మాయమాటలు చెప్పేవాడు. నిరుద్యోగులు మాక్లూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా నార్త్‌రూరల్ సీఐ సతీష్ అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. ఈ విషయమై సీఐ సతీష్‌ను సంప్రదించగా నిరుద్యోగుల నుంచి రూ.లక్ష నుంచి రూ.4 లక్షల వరకు తీసుకున్నాడని తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

నేర చరిత్ర

రామకృష్ణకు గతంలో నేర చరిత్ర ఉంది. రామకృష్ణ పోలీస్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం రావడంతో 2013లో ఆర్మూర్ మండలం మునిపల్లి నుంచి ఓ యువతిని వివాహం చేసుకున్నాడు. 2015లో ఆమెను చంపి ముక్కలుగా చేసి సూటుకేసులో పెట్టి వికారాబాద్ అడవుల్లో పారవేయడం అప్పట్లో సంచలనం సృష్టించింది. ఈ కేసులో రామకృష్ణను పోలీసు ఉద్యోగం నుంచి సస్పెండ్ చేశారు. ఆ తర్వాత పోలీసు అకాడమీ పేరిట నిరుద్యోగులను మోసం చేయడం ప్రారంభించినట్లు తెలిసింది.

చికిత్స పొందుతూ రైతు మృతి

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మహారాష్ట్రకు చెందిన రైతు బుధవారం మృతి చెందాడు. టూటౌన్ సీఐ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని కిన్వట్ తాలుకా కొటారి గ్రామానికి చెందిన రైతు రాథోడ్ నితిన్ (30)తనకున్న రెండెకరాల వ్యవసాయ భూమిలో పత్తి పంట సాగు చేశాడు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చేనులో గడ్డి ఏపుగా పెరిగింది. గతనెల 29న చేనులో గడ్డి మందు కొట్టేందుకు వెళ్లిన ఆయన ఇక పంట చేతికి రాదనే మనస్తాపానికి గురయ్యాడు. అదే గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి


తొడసం లక్ష్మణ్ మృతదేహం

గుడిహత్నూర్(బోథ్): మండలంలోని మాన్కాపూర్ పరిధిలోని రాంజీగూడకు చెందిన తొడసం లక్ష్మణ్ (21) గతనెల 26న బైక్‌పై గుడిహత్నూర్ వస్తుండగా స్థానిక లక్ష్మీదాబా వద్ద ఆదిలాబాద్ నుండి ఉట్నూర్ వెళ్తున్న కారు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108లో రిమ్స్‌కు తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు కుటుంబ సభ్యులు నిజామాబాద్‌లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించి బుధవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై బలిరాం తెలిపారు.

ఆందోళనను అడ్డుకున్న పోలీసులు



ఆందోళనకారులను అడ్డుకుంటున్న పోలీసులు

ఆదిలాబాద్‌టౌన్: హర్యాన రాష్ట్రంలోని నుహ్‌మెవాత్ జిల్లాలో పరిషత్ నిర్వహించిన బ్రిజ్ మండల్ జలాభిషేక్ యాత్రపై జరిగిన దాడికి నిరసనగా హిందూ సంఘాలు బుధవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నిరసన కార్యక్రమానికి పిలుపునిచ్చాయి. దీంతో వన్‌టౌన్, టూటౌన్ పోలీసు అప్రమత్తమై తెలంగాణ చౌక్‌లో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి ఆందోళనకారులను ముందస్తుగానే అడ్డుకున్నారు. అక్కడికి చేరుకున్న నిరసనకారులను అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. దీంతో ఆ ప్రాంతంలో కొంతసేపు ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. ఈ సందర్భంగా ఆందోళనకారులు మాట్లాడుతూ యాత్రపై దాడిచేసిన దుండగులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రాళ్ల దాడి కారణంగా వందలాది మంది గాయాలపాలైనట్లు తెలిపారు. ఈ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అరెస్టయిన వారిలో హిందూ సంఘాల నాయకులు దశరథ్, నారాయణ, కృష్ణకుమార్, గంద్రత్ సంతోష్, దత్తాత్రేయ, జ్ఞానేశ్వర్, మహేష్, తదితరులు ఉన్నారు.

బాసరలో రాష్ట్ర మహిళా చైర్‌పర్సన్ పూజలు


పూజలు చేస్తున్న సునితా లక్ష్మారెడ్డి

భైంసా(ముధోల్): బాసర సరస్వతీ అమ్మవారిని బుధవారం తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునితా లక్ష్మారెడ్డి దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారి ఆలయంలో పూజలు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోర్వ్ శ్యామ్, నాయకులు జిడ్డు మల్లయ్యాయాదవ్‌తో పాటు పలువురు సునీతాలక్ష్మారెడ్డిని సన్మానించి బాసర సరస్వతీ అమ్మవారి చిత్రపటం అందజేశారు.

ఖానాపూర్‌లో మూడిళ్లలో చోరీ

- బంగారం, వెండితో పాటు మద్యం బాటిళ్లు చోరీ


విచారణ చేస్తున్న పోలీసులు

ఖానాపూర్: పట్టణంలోని శాంతినగర్ కాలనీలో గల పలు నివాసాల్లో మంగళవారం రాత్రి దొంగలు చోరీలకు పాల్పడ్డారు. ఒకే కాలనీలో తాళం వేసి వున్న మూడిళ్లలో చోరీకి పాల్పడ్డారు. కాలనీలోని ఎడుముల లావణ్య నివాసంలో 18 గ్రాముల బంగారంతో పాటు 25 తులాల వెండి, ఎడ్ల నాగలక్ష్మి నివాసంలో రెండు గ్రాముల బంగారంతో పాటు 20 తులాల వెండి, మిట్టపల్లి ప్రవీణ్ ఇంట్లో చోరీకి యత్నించినప్పటికీ ఎలాంటి బంగారు నగలు, నగదు లేకపోవడంతో మూడు అమెరికన్ మద్యం ఫుల్ బాటిళ్లను ఎత్తుకెళ్లారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని ఎస్సై ఆర్.శంకర్ తెలిపారు.

లక్కేరావు మరణం పార్టీకి తీరని లోటు

- మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి


చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న మంత్రి ఐకేరెడ్డి

ఇంద్రవెల్లి(ఖానాపూర్): బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఏటీడబ్ల్యూఏసీ చైర్మన్ కనక లక్కేరావ్ అకాల మరణం పార్టీకి తీరనిలోటని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని తుమ్మగూడకు వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. లక్కేరావ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల్లో బాధిత కుటుంబ పరిస్థితి గురించి సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. బాధిత కుటుంబాన్ని ఆదుకునేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. లక్కేరావ్ మరణం పార్టీ కార్యకర్తలకు కలిచి వేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యుల సంప్రదాయ కార్యక్రమాలు పూర్తయిన తర్వాత పార్టీ ఆధ్వర్యంలో సంతాపసభ ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, పీఏసీఎస్ చైర్మన్ మారుతి డొంగ్రె, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ అంజద్, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల మరణాలు ప్రభుత్వ హత్యలే..

- టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు పటేల్


సంతాపం తెలుపుతున్న వెడ్మ బొజ్జు

ఉట్నూర్‌రూరల్: దేశానికి స్వాతంత్య్రం వచ్చి దశాబ్దాలు కావస్తున్నా గ్రామాలకు సరైన రోడ్లు, వంతెనలు నిర్మించక పోవడంతో సకాలంలో వైద్యం అందక గిరిజనులు మరణిస్తున్నారని, ఇవి ప్రభుత్వ హత్యలేనని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు, టీపీసీసీ ఆదివాసీ విభాగం కోఆర్డినేటర్ పుర్క బాపురావు ఆరోపించారు. బుధవారం మండలంలోని ఆడగూడ గ్రామానికి చెందిన ఆడ మారుతి అనే గిరిజనుడు జాండీస్ (పచ్చకామెర్లు) వ్యాధితో మృతి చెందగా రోడ్డు, వంతెన సౌకర్యం లేక మృతదేహాన్ని ఎడ్లబండిపై గ్రామానికి తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న వారు గ్రామాన్ని సందర్శించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల కురుస్తున్న వర్షాలకు ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ఎమ్మెల్యే రేఖానాయక్ ఒక్క గ్రామాన్ని కూడా సందర్శించకపోవడం విచారకరమన్నారు. తెలంగాణ ప్రభుత్వం గిరిజనుల సమస్యల పరిష్కారంలో నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందన్నారు. ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఆయన వెంట నాయకులు జాదవ్ సునీల్, కొమట్‌రెడ్డి మల్లారెడ్డి, అబ్దుల్ ఖయ్యుం, విరుదుల లాజర్, దూట రాజేశ్వర్, భీమన్న, షేక్ సలీం, దేవానందం, ఇమ్రాన్ గుణవంత్‌రావు, అర్బాజ్, నగేశ్ ఉన్నారు.

ఆదివాసీ దినోత్సవం విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న గోడం రేణుక

ఆదిలాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాల మైదానంలో ఈ నెల 9న ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ), అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న ప్రపంచ ఆదివాసీ దినోత్సవానికి ఆదివాసీలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆదివాసీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు గోడం రేణుక పిలుపునిచ్చారు. బుధవారం మావల మండలంలోని బట్టిసావర్‌గాం శివారు ప్రాంతంలోని సర్వే నంబర్ 72లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆదివాసీల స్వయం పాలన, ఆత్మగౌరవం, అస్తిత్వం, హక్కుల సాధన కోసం నిరంతరం తమవంతు పోరాటం చేస్తున్నామన్నారు. సమావేశంలో ఆ సమితి జిల్లా ఉపాధ్యక్షురాలు ఉయిక ఇందిరా, మహిళ నాయకురాలు వెట్టి పారుబాయి, మడావి అనసూయ, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ దత్తతను అడ్డుకున్న షీటీమ్


పాపను తీసుకుంటున్న అధికారులు

సారంగపూర్(నిర్మల్): మండలంలోని జామ్ గ్రామంలో షీటీమ్ ఎస్సై సుమాంజలి ఆధ్వర్యంలో బుధవారం రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించి 5నెలల చిన్నారిని సంరక్షించారు. సదరు బాలికను స్త్రీ శిశు సంక్షేమశాఖ సంరక్షణ గృహానికి తరలించారు. షీటీమ్ ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం జామ్ గ్రామానికి చెందిన కల్‌లై గంగామణి–సంజీవ్ దంపతులకు సంతానం లేకపోవడంతో ఇటీవల నిర్మల్ జిల్లా కేంద్రంలోని శాంతినగర్ ఎల్లమ్మ గుడి ప్రాంతానికి చెందిన జార్పుట్ అర్చన–శేఖర్ దంపతుల 5నెలల కుమార్తెను రూ.2.50 లక్షలు చెల్లించి దత్తత స్వీకారం చేశారు. విషయం తెలుసుకున్న షీటీమ్ ఎస్సై చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుల సహకారంతో రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించారు. జామ్ గ్రామానికి వెళ్లి వివరాలు సేకరించారు. చిన్నారిని సంరక్షించి సంరక్షణ గృహానికి పంపించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లోఎస్సై కృష్ణసాగర్‌రెడ్డిని కలిసి జనరల్ డైరీలో నమోదు చేయించారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు స్వదేశ్ పరికిండ్ల, నల్ల శ్రీలత, లీగల్ ప్రొబేషన్ అధికారి సరేందర్, జిల్లా బాలల సంరక్షణ అధికారి వోస శ్రీనివాస్, జామ్ షీటీమ్ సిబ్బంది రాధిక, రమాదేవి, అంగన్‌వాడీ కార్యకర్త జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తాం

- ఎన్‌పీడీసీఎల్ వరంగల్ డైరెక్టర్ గణపతి


విద్యుత్ స్తంభాలను పరిశీలిస్తున్న గణపతి

దస్తురాబాద్: గోదావరి తీరప్రాంతాల్లో ఇటీవల వరద తాకిడికి విరిగిపోయిన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటుచేసి రైతులకు విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తామని ఎన్‌పీడీసీఎల్ వరంగల్ డైరెక్టర్ గణపతి తెలిపారు. బుధవారం మండలంలోని భూత్కూర్ గ్రామ పంచాయతీలోని రాంపూర్, గొడిసిర్యాల గోదావరి తీర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదావరి తీర ప్రాంతంలో భారీ వరదల కారణంగా 60 విద్యుత్ స్తంభాలు, 20 విద్యుత్ నియంత్రికలు ధ్వంసమయ్యాయన్నారు. ఏటా వరదలతో సంస్థకు భారీ నష్టం వాటిల్లుతోందన్నారు. వరదాల తాకిడి నుండి విద్యుత్ స్తంభాలను, విద్యుత్ నియంత్రికలను కాపాడుకునేలా ప్రత్యేక చర్యలు చేపడుతామన్నారు. ఆయన వెంట డీఈ నాగరాజు, ఏడీఈ శ్రీనివాస్, విద్యుత్ సిబ్బంది చరణ్‌దాస్, ప్రేమ్, రైతులు ప్రభాకర్, పోశన్న, గోపాల్, రాజన్న, రాకేష్ ఉన్నారు.

విద్యుత్ స్తంభాలను సరిచేస్తాం

పెంబి: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొట్టుకుపోయిన విద్యుత్ స్తంభాలను సరి చేస్తామని ఎన్‌పీడీసీఎల్ ఐపీసీ డైరెక్టర్ గణపతి అన్నారు. బుధవారం మండలంలోని నాగాపూర్, శేట్‌పల్లి, పసుపుల గ్రామాల్లో పర్యటించారు. ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలను పరిశీలించారు. శేట్‌పల్లి వద్ద రెండు నూతన టవర్లను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట ఏడీ శ్రీనివాస్, ఏఈఈ శ్రీనివాస్, విద్యుత్ సిబ్బంది ఉన్నారు.

మంత్రిని కలిసిన బరంపూర్ వాసులు


మంత్రికి విన్నవిస్తున్న కమిటీ సభ్యులు

తలమడుగు: బరంపూర్ గ్రామాన్ని మండలం చేయాలని మండల సాధన కమిటీ ఆధ్వర్యంలో 12 గ్రామ పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీలు బుధవారం నిర్మల్‌లో మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలం ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. మండల ఏర్పాటుకు కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో బాబన్న, మొట్టె కిరణ్ కుమార్, ప్రభాకర్ రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, కేదారేశ్వర్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మాధవరావు, రమేశ్‌రెడ్డి, రంజిత్ రెడ్డి, మల్కు, రాజేశ్వర్, తదితరులు ఉన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని కాపాడిన పోలీసులు



బీరయ్యతో ఎస్సై రవీందర్

సోన్: నిర్మల్ జిల్లా సోన్ మండల కేంద్రంలోని గోదావరి నది బ్రిడ్జిపై ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తిని పోలీసులు కాపాడారు. ఎస్సై రవీందర్ కథనం ప్రకారం.. బుధవారం నిజామాబాద్ జిల్లా అందకూర్ గ్రామానికి చెందిన బ్యాగరి బీరయ్య కుటుంబ సమస్యలతో గోదావరి నది బ్రిడ్జిపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకునేందుకు వచ్చాడు. పోలీసులకు సమాచారం అందడంతో హెడ్ కానిస్టేబుల్ ప్రతాప్‌రెడ్డి, రైటర్ భీమయ్య, పెట్రోకార్ సిబ్బంది శేఖర్ సంఘటన స్థలానికి చేరుకుని అతడిని సురక్షితంగా పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లారు. కుటుంబ సభ్యులకు అప్పగించారు. సీఐ నవీన్‌కుమార్ పోలీసులను అభినందించారు.